క్లుప్తంగా

'కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'



జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

జగిత్యాల: నిబంధనలకు విరుద్ధంగా జిల్లాలో ఏర్పాటు చేసిన కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఓ కార్పొరేట్ పాఠశాల ఎదుట మంగళవారం ఆందోళన చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నడుస్తున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, శ్రీను, మనోహర్, చరణ్ పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ధర్మపురి: బడుగు, బలహీన వర్గాల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేసారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ వెంకటేశ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితులకు, బలహీన వర్గాలకు ఇళ్లు లేని వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందించాలని, అర్హులైన వారికి పెన్షన్లు, బీడీ కార్మికులకు పెన్షన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం సభ్యులు ముప్పట్ల లక్ష్మి, సుమలత, బొల్లారపు రాధ, రత్నం, భారతి, నల్ల లక్ష్మి, సుద్దాల రాజమణి పాల్గొన్నారు.

బక్రీద్‌కు వసతులు కల్పించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న మైనార్టీ నాయకులు

మెట్‌పల్లి: పట్టణంలో బక్రీద్‌కు మున్సిపల్ ఆధ్వర్యంలో తగిన వసతులు కల్పించాలని కోరుతూ మైనార్టీ నాయకులు మంగళవారం కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. మసీదులు, ఈద్గా, కబ్రస్తాన్‌ల వద్ద పరిసరాలను పరిశుభ్రం చేయించి, అవసరమైన వసతులను కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మర్కజీ ఇంతేజామి కమిటీ అధ్యక్షుడు ఖుత్బొద్దీన్, షకీల్, సల్మాన్, సాదక్ హుస్సేన్, రహీముద్దీన్ పాల్గొన్నారు.

గ్రంథాలయ భవనం ప్రారంభం



పుస్తకాలు పరిశీలిస్తున్న నాయకులు

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్‌లో నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు చంద్ర శేఖర్ గౌడ్, సర్పంచ్ పిడుగు రాధ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చంద్ర శేఖర్ గౌడ్ మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానం, మేధాశక్తి పెరుగుతుందన్నారు. గ్రామీణ యువతను మళ్లీ పుస్తక పఠనం వైపు మళ్లించేందుకు గ్రంథాలయాల్లో అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, జిల్లా రైతు బంధు అధ్యక్షుడు చీటి వెంకట్రావు, సర్పంచుల ఫోరం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్, పీఏసీఎస్ చైర్మన్ సాయి రెడ్డి, ఎంపీటీసీలు ప్రియాంక, గంగాధర్, నాయకులు సురేశ్ గౌడ్, పిడుగు సందయ్య, కుంటాల వికాస్, తదితరులు పాల్గొన్నారు.

'ఇథనాల్ పరిశ్రమపై జీవన్‌రెడ్డి అనవసర రాద్ధాంతం'

వెల్గటూర్: ఇథనాల్ పరిశ్రమపై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అనవసర రాద్ధాంతం చేస్తున్నారని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంగళవారం వెల్గటూర్‌లో మాట్లాడారు. రాజకీయాల్లో అనుభవజ్ఞుడైన జీవన్‌రెడ్డి ఇలా తప్పుడు ఆరోపణలు చేయడం సమంజసం కాదని హితవు పలికారు. 24 గంటల విద్యుత్ ఇచ్చినట్లు నిరూపిస్తే రాజకీయ సన్యాసం చేస్తానన్న మాటకు కట్టుబడి ఉండాలని అన్నారు. మంత్రి వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

అటకెక్కిన హరిత లక్ష్యం

- ఖాళీ కుండీలకు వృథా ఖర్చు
- కానరాని మొక్కలు, మాయమైన కుండీలు
- లక్షలాది రూపాయల ప్రజాధనం రోడ్డు పాలు



చెట్ల పొదల్లో వృథాగా పడేసిన పూల కుండీలు



బైపాస్ రోడ్డులో ఖాళీ కుండీలు

జగిత్యాలటౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం పనులు అధికారుల అనాలోచిత నిర్ణయాలతో అటకెక్కుతున్నాయి. పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా చేపట్టిన హరిత లక్ష్యం చేరుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. మౌలిక సదుపాయాల కల్పన గాలికొదిలేసి, హరితహారం పేరుతో జరుగుతున్న ప్రచారం ఆర్భాటం వల్ల ప్రజాధనం వృథా అవుతోందని జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హరితహారంలో భాగంగా పట్టణ ప్రగతి నిధుల నుంచి రూ.8 లక్షలు కేటాయించి అధికారులు 1000 కుండీలు కొనుగోలు చేశారు. ఇందులో దాదాపు 600 కుండీల్లో మాత్రమే మొక్కలు నాటి, మిగతా 400 కుండీలను పంప్‌హౌజ్ వద్ద పొదల్లో నిరుపయోగంగా వదిలేశారు.

ఖాళీ కుండీలకు లక్షల్లో ఖర్చు

ఇరుకైన రోడ్లు, పార్కింగ్ సమస్య, నిర్వహణ లోపంతో మొక్కలు ఎండిపోగా పెట్టిన కుండీలు సైతం మాయమయ్యాయి. అధికారుల నిర్లక్ష్యం, అత్యుత్సాహంతో లక్షలాది నిధులు వృథా చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు సర్వైవల్ లేదంటూ కుండీల్లో మొక్కలు పెంచే కార్యక్రమాన్ని మధ్యలోనే నిలిపేశారు. బల్దియా అధికారుల తీరుతో హరితలక్ష్యం నెరవేరడం సంగతి దేవుడెరుగు గాని, లక్షలాది రూపాయల ప్రజాధనం నిరుపయోగమైందని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బల్దియా అధికారుల అనాలోచిత నిర్ణయం, పాలకవర్గం ప్రచార ఆర్భాటం కోసం వృథా అయిన ప్రజాధనానికి బాధ్యులెవరని పన్నులు కట్టిన ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మొదట హడావుడి.. ఆ తర్వాత నిర్లక్ష్యం

ఏదైనా కార్యక్రమం ప్రారంభించే ముందు హడావుడి చేస్తున్న అధికారులు ఆ తర్వాత వాటి నిర్వహణను గాలికొదిలేస్తున్నారని విమర్శలున్నాయి. ఇరుకైన రోడ్డులో పెద్ద, పెద్ద కుండీలు వాటిలో మొక్కలు పెట్టి వాటి నిర్వహణపై నిర్లక్ష్యం వహించారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

మాయమైన కుండీలు

పట్టణంలోని ప్రధాన రోడ్లకు ఇరువైపులా కుండీలు ఏర్పాటు చేసి మొక్కలు నాటారు. అసలే ఇరుకైన రోడ్లు, పార్కింగ్‌కు చోటు లేకుండా షాపుల ముందు ఏర్పాటు చేసిన కుండీలను షాపుల యజమానులు పట్టించుకోక, బల్దియా అధికారుల పర్యవేక్షణ కరువై చాలా చోట్ల కుండీలు మాయమవగా, బైపాస్ రోడ్డు లాంటి కొన్ని చోట్ల ఖాళీకుండీలు దర్శనమిస్తున్నాయి.

నిరుపయోగంగా కుండీలు

మొక్కలు ఎండిపోవడంతో రోడ్ల వెంట ఉంచిన కుండీలు మాయమయ్యాయి. సర్వైవల్ లేదంటూ కుండీల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మధ్యలోనే నిలిపేసిన అధికారులు మిగిలిన కుండీలను పంప్‌హౌజ్ వద్ద చెట్లపొదల్లో వదిలేశారు. వానకు నాని, ఎండకు ఎండిన కుండీలు పగిలిపోయి పనికి రాకుండా పోతున్నాయి. అధికారుల అనాలోచిత నిర్ణయాలతో లక్షలాది రూపాయల ప్రజాధనం రోడ్డుపాలయిందని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

అధికారులే బాధ్యత వహించాలి



ఇరుకైన రోడ్లకు తోడు షాపుల ముందు పార్కింగ్ సైతం లేని పరిస్థితుల్లో యావర్ రోడ్డుతో పాటు పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట పెద్దపెద్ద కుండీల్లో మొక్కలు నాటడం అధికారుల అనాలోచిత చర్య. వృథా అయిన ప్రజాధనానికి అధికారులే బాధ్యత వహించాలి. బాధ్యులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– సిరిపురం మహేందర్, న్యాయవాది

పనులు నిలిపివేశాం

పాలకవర్గం నిర్ణయం మేరకు రోడ్లకిరువైపుల కుండీల్లో మొక్కలు నాటాం. సర్వైవల్ లేకపోవడంతో కుండీల్లో మొక్కలు నాటే పనులు నిలిపివేశాం.

– రాజేశ్వర్ డీఈ, జగిత్యాల మున్సిపాలిటీ

ఘనంగా విద్యా దినోత్సవం



కుస్తాపూర్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల ర్యాలీ



కథలాపూర్‌లో కేజీబీవీ విద్యార్థినుల ర్యాలీ



రాయికల్‌లో విద్యార్థుల మానవహారం



ఇబ్రహీంపట్నంలో బోనాలతో విద్యార్థినులు

జగిత్యాల/ధర్మపురి/రాయికల్/మల్లాపూర్/ఇబ్రహీంపట్నం/కథలాపూర్/ కోరుట్ల రూరల్/మల్యాల/ బుగ్గారం/ గొల్లపల్లి/ సారంగాపూర్/ పెగడపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీ విద్యాలయాలు, గురుకుల హాస్టళ్లలో విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీలు చేపట్టి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందరూ కృషి చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్



అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మల్యాల: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన ఉందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని రామన్నపేట జిల్లా పరిషత్ పాఠశాలలో మన ఊరు..మనబడి పథకం కింద చేపట్టిన పనులను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీలు నిర్వహించారు. మానాల, బల్వంతాపూర్ గ్రామాల్లో గ్రంథాలయాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. రామన్నపేటలో చాకలి ఐలమ్మ విగ్రహం ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ దేశంలో అత్యధికంగా గురుకుల పాఠశాలలున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా విధానం ఇంగ్లిష్ బోధన చేపట్టామన్నారు. మధ్యాహ్నం సన్నబియ్యంతో భోజనం, పౌష్టిక ఆహారం అందిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే భోజనం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొండపల్కల రాంమోహన్‌రావు, ఎంపీపీ మిట్టపల్లి సుదర్శన్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, మార్కెట్ కమిటీ చైర్మన్ కోరండ్ల నరేందర్‌రెడ్డి, సర్పంచ్ గడ్డం జలజ, ఎంపీటీసీ సఫియా వలీ, కోఆప్షన్ సభ్యుడు ఎండీ.అజారొద్దీన్ పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

కొండగట్టు: విద్యా దినోత్సవం సందర్భంగా కొడిమ్యాల మండలం నాచుపెల్లిలో నూతన గ్రంథాలయ భవనాన్ని మంగళవారం చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, గ్రంథాలయ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ అంబాటి లత, జెడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి ఎంపీపీ మేనేని స్వర్ణలత, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



డిజిటల్ తరగతులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రాయికల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాయికల్ పట్టణంలోని మన ఊరు మన బడి కార్యక్రమంలో రూ.40 లక్షల వ్యయంతో అభివృద్ధి పనులను, డిజిటల్ క్లాస్‌రూమ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య,మౌలిక వసతులతో పాటు,ఉచితంగా యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్నామన్నారు. గురుకులాలను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యనందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, జెడ్పీటీసీ జాదవ్ అశ్విని, వైస్ చైర్మన్ రమాదేవి, కౌన్సిలర్లు మ్యాకల అనురాధ, శ్రీధర్ రెడ్డి, కాంతారావు, మహేశ్, సాయికుమార్, సోహెల్, మహేందర్‌బాబు, సంతోష్‌కుమార్, డీఈ భాస్కర్, ఎంఈవో గంగాధర్ పాల్గొన్నారు.

సర్కారు బడులకు మహర్దశ

సారంగాపూర్: సర్కారు బడులకు మహర్దశ పడుతోందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. బీర్‌పూర్ మండలం తుంగూర్ ప్రాథమిక పాఠశాలలో తరగతి భవనం, ఇతర అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఓగుల అజయ్ అనే యువకుడు పాఠశాల అభివృద్ధికి రూ.1లక్ష అందించగా ఆయనను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, సర్పంచ్ గుడిసె శ్రీమతి, జెడ్పీటీసీ పాత పద్మ, ఎంపీటీసీ ఆడెపు మల్లీశ్వరి, ఎంఈవో వాసం భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

మల్లాపూర్: విద్యార్థులు గమ్యం చేరేవరకు తీవ్రంగా శ్రమించాలని రేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలహెచ్‌ఎం గణేందర్ అన్నారు. మండలంలోని రేగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ ఫలితాలలో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను మంగళవారం వాయుపుత్ర యూత్ సభ్యులు ఘనంగా సన్మానించి నగదు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఎస్సెస్సీ ఫలితాలల్లో టాపర్లుగా నిలిచిన మొదటి ముగ్గురు విద్యార్థులకు వాయుపుత్ర యూత్ సభ్యులు నగదు పురస్కారాలు అందించడం అభినందనీయమన్నారు.కార్యక్రమంలో వాయుపుత్ర యూత్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్

మల్లాపూర్: మండలంలోని రత్నాపూర్‌లో బాధిత కుటుంబానికి ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ అండగా నిలిచింది. రత్నాపూర్‌లో ఈదురుగాలులకు బక్కూరి శేఖర్ ఇల్లు దెబ్బతినడంతో, ట్రస్ట్ అధ్యక్షుడు సుర్గి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యులు విజయ్, అభి, రవితేజ పాల్గొన్నారు.

రెండు మండలాల్లో బీజేపీ సమావేశాలు

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో టిఫిన్ బైఠక్ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ పార్టీని వచ్చే ఎన్నికల్లో విజయతీరాన నడిపించడానికి కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి, ప్రజల మధ్య ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి, పడాల తిరుపతి, ఎడమల శైలేంధర్‌రెడ్డి, మ్యాడ జనార్దన్, ఆడెపు రమేశ్, వూరడి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల నేత్రదానం

జగిత్యాల: తెలంగాణ సీనియర్ సిటిజన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో నేత్రదానానికి పలువురు అంగీకారం తెలిపారు. వేధింపుల నివారణ అవగాహన వారోత్సవాల్లో భాగంగా మంగళవారం 36 మంది సీనియర్ సిటిజన్లు నేత్రదానానికి ఒప్పుకుని అంగీకార పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేత్రదానం ఎంతో గొప్పదని, సీనియర్ సిటిజన్లు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్, దేశాయి, రాంకుమార్,అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల మంజూరుకు కృషి

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



డార్మెటరీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.1.35 కోట్లతో నిర్మించిన కళాశాల అదనపు తరగతి గదులు, డార్మెటరీ భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల పనితీరు ఉందన్నారు. కార్పొరేట్ కళాశాలల్లో లక్షల్లో ఫీజులు తీసుకుంటున్నారని, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఉచితంగా నాణ్యమైన విద్య అందిస్తున్నామని, విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. పదో తరగతిలో మండల స్థాయి ర్యాంకులు సాధించిన మోడల్ స్కూల్ విద్యార్థులను సన్మానించారు. అనంతరం 34 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఎంపీపీ జాజాల భీమేశ్వరి, వైస్ ఎంపీపీ నోముల లక్ష్మారెడ్డి, సర్పంచ్ నేమూరి లత, మండల ప్రత్యేకాధికారి బాలే శివాజీ, ఎంపీడీవో ప్రభు, తహసీల్దార్ రవికిరణ్‌కుమార్, ఎంపీవో కృపాకర్, మండల కోఆప్షన్ సభ్యుడు ఎలేటి చిన్నారెడ్డి, ఎంపీటీసీ తిమ్మణి రాములు, పాఠశాల ప్రత్యేకాధికారి గీత, సింగిల్‌విండో చైర్మన్ బద్దం గోపి, వైస్ చైర్మన్ జిల్లాల పవన్, నాయకులు సుగుణాకర్‌రావు, నేమూరి సత్యనారాయణ, జగన్‌రావు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

మెట్‌పల్లి: విద్యాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. మండలంలోని మేడిపల్లిలో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలలో మంగళవారం విద్యా దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. పేద విద్యార్థులకు కేజీ టూ పీజీ ఉచిత విద్యను అందించడానికి ప్రభుత్వం గురుకులాలను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, సర్పంచ్ పీసు తిరుపతిరెడ్డి, ఎంపీడీవో భీమేశ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ తిరుపతిలతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి



జగిత్యాలలో ఆందోళన చేస్తున్న నాయకులు

జగిత్యాల: ఇళ్లులేని నిరుపేదలకు స్థలాలు కేటాయించి పట్టాలివ్వాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకున్న పేదలపై ప్రభుత్వం నిర్బంధం వెంటనే ఆపాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని, ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న ప్రతి ఒక్కరికి 125 గజాల స్థలాన్ని పట్టా చేయాలన్నారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్, సులోచన, శారద పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలని ధర్నా

కోరుట్ల: పట్టణ శివారులోని జంబిగద్దె ప్రాంతంలో సర్వే నెంబర్ 923లో గుడిసెలు వేసుకున్న వారికి ఇళ్ల స్థలాలు ఇప్పించాలని కోరుతూ పూలే అంబేడ్కర్ నగర్ ఇళ్ల స్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి తహసీల్దార్ రాజేశ్‌కు వినతి పత్రం సమర్పించారు. సర్వే నెంబర్ 923లో 71 రోజులుగా గుడిసెలు వేసుకుని ఉంటున్నామని పేర్కొన్నారు. తాము వేసుకున్న గుడిసెలకు పట్టాలిచ్చి విద్యుత్, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ తిరుపతి నాయక్, నాయకులు గుమ్మడి రమేశ్, రజియా సుల్తాన, నాగరాజు, పోచన్న, యశోద, మమత, తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ ఇంకెప్పుడు?



డబుల్ ఇళ్లు పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

జగిత్యాలటౌన్: డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం ఐదేళ్లుగా సాగుతూనే ఉందని, ఇంకెప్పుడు లబ్ధిదారులకు పంపిణీ చేస్తారని బీజేపీ నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి ప్రశ్నించారు. నూకపెల్లిలో నిర్మిస్తున్న డబుల్‌బెడ్‌రూం ఇళ్లను మంగళవారం నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. డబుల్ ఇళ్ల నిర్మాణం ఐదేళ్లుగా కొనసాగుతూనే ఉందని, వెంటనే పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. డబుల్ ఇళ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయని ఆరోపించారు. ఇళ్లకు వెళ్లేందుకు సరైన రోడ్డు సౌకర్యం లేదన్నారు. తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తయి 3నెలలు గడుస్తున్నా ఎందుకు పంపిణీ చేయడం లేదని ప్రశ్నించారు. ఆయన వెంట బీజేపీ పట్టణ అధ్యక్షుడు వీరబత్తిని అనిల్, అర్బన్ మండల ఇన్‌చార్జి జున్ను రాజేందర్, మోహన్‌రెడ్డి, యువ మోర్చా నాయకులు బొల్లం అజయ్ తదితరులు ఉన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలి

జగిత్యాలరూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకే చిన్నారులను పంపించాలని సీడీపీవో వీరలక్ష్మి అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్, గుల్లపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రానికి కొత్తగా వస్తున్న చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే సేవలన్నింటినీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెండున్నరేళ్లు దాటిన పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని, ప్రైవేటు స్కూళ్లకు పంపించొద్దన్నారు. మూడున్నర ఏళ్ల పిల్లలకు ఎల్‌కేజీ బుక్స్, నాలుగేళ్ల పిల్లలకు యూకేజీ బుక్స్ అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి, సర్పంచులు తిరుపతి, రాజేశ్వర్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేస్తోన్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బొల్లం కృష్ణవేణి అన్నారు. మండలంలోని ముత్యంపేట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అనేక సంక్షేమ పథకాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మోబిన్, హెచ్‌ఎం నర్సయ్య, సీఆర్పీ దేవరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ రోడ్డ శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు, నాయకులు పాల్గొన్నారు.

అలరించిన వీడ్కోలు వేడుకలు



నృత్య ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

కోరుట్ల: పట్టణంలోని అరుణోదయ డిగ్రీ కళాశాలలో వీడ్కోలు వేడుకలు అలరించాయి. డిగ్రీ పూర్తి చేసి వెళ్తున్న విద్యార్థులకు జూనియర్ విద్యార్థులు మంగళవారం వీడ్కోలు పార్టీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో కరస్పాండెంట్ పోతని ప్రవీణ్ కుమార్, ప్రిన్సిపాల్ పోతని నవీన్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.